





బాధ్యతలు స్వీకరిస్తున్న ప్రతిమాసింగ్

ప్రత్యేకాధికారిగా అదనపు కలెక్టర్ బాధ్యతల స్వీకరణ

రంగారెడ్డి అర్బన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : పాలకవర్గాల పదవీ కాలం ముగియడంతో రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలో 12 మున్సిపాలిటీలు, మూడు కార్పొరేషన్లకు ప్రత్యేకాధికారులను నియమించింది. ఆదిబట్ల, ఇబ్రహీంపట్నం, పెద్ద అంబర్‌పేట్, షాద్‌నగర్, తుర్కయంజాల్ మున్సిపాలిటీలకు, మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌కు అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్‌ను ప్రత్యేకాధికారిగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు అదనపు కలెక్టర్ సోమవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో బాధ్యతలు చేపట్టారు.

బాలలను పనిలో పెట్టుకుంటే చర్యలు

చౌదరిగూడ, జనవరి27 (ఆంధ్రజ్యోతి): బాల కార్మికులను పనిలో పెట్టుకుంటే చట్టరీత్యా చర్యలు తప్పవని స్మైల్‌టీం ఎస్ఐ రాంచందర్ హెచ్చరించారు. సోమవారం కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ, ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని మొగిలిగిద్ద ఇటుక బట్టీల వద్ద జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఆదేశాల మేరకు స్మైల్ టీం ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. బట్టీల వద్ద పనిచేస్తున్న ఇతర రాష్ట్రాలకు కూలీల పిల్లలను బడికి పంపించేలా యజమానులు చర్యలు తీసుకోవాలని సూచించారు. మొగల్‌గిద్ద, కొందుర్గు, జిల్లేడ్‌చౌదరిగూడ మండలాల్లో ఉన్న ఇటుక బట్టీల వద్ద కొంతమంది పిల్లలను గుర్తించి పాఠశాలకు పంపించినట్లు ఆయన తెలిపారు. డీసీపీయూ ప్రొటెక్షన్ ఆఫీసర్ సంజీవ, లేబర్ ఆఫీసర్ యాదగిరి, పోలీసులు బుగ్గయ్య, రాములు, అనూష, శ్రీధర్, ఉషశ్రీ పాల్గొన్నారు.



‘పది’కి ప్రత్యేకం

విద్యార్థులకు పరీక్షా కాలం మొదలైంది. పదో తరగతి పరీక్షల షెడ్యూల్ కూడా విడుదలైంది. మార్చి 21 నుంచి జరిగే ఎగ్జామ్స్ కోసం జిల్లా విద్యాశాఖ విద్యార్థులను సిద్ధం చేస్తోంది. ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ సందేహాలను నివృత్తి చేస్తున్నారు. సబ్జెక్టుల్లో వెనుకబడిన వారిపై దృష్టి సారిస్తూ ప్రత్యేకంగా బోధిస్తున్నారు. ఈ సారి పరీక్షల్లో శత శాత ఉత్తీర్ణతే లక్ష్యంగా అధికారులు, ఉపాధ్యాయులు ముందుకు సాగుతున్నారు.

- ఎప్పటికప్పుడు సందేహాల నివృత్తి
- వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ప్రణాళికలు
- అందని స్నాక్స్.. అర్ధాకలితో చదువులు
- మార్చి 21 నుంచి పదో తరగతి పరీక్షలు
- జిల్లాలో 51,823 మంది విద్యార్థులు

రోజుకు రెండు గంటలు స్పెషల్ క్లాసులు

రంగారెడ్డి అర్బన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల భవిష్యత్‌కు పదో తరగతి తొలిమెట్టు. దశ, దిశను నిర్దేశించేది ఈ క్లాసే. మార్చి 21 నుంచి పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా విద్యాశాఖ ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళ్తుంది. పాఠశాలల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ప్రైవేటుకు దీటుగా వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. పదిలో జిల్లాను రాష్ట్రంలో ముందు వరుసలో ఉంచేలా కలెక్టర్, డీఈవో ఎప్పటికప్పుడు సమావేశాలు నిర్వహిస్తున్నారు. పాఠశాలలను సందర్శించి విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలను పరీక్షిస్తున్నారు. ప్రణాళికాబద్ధంగా పరీక్షలకు సిద్ధం చేయిస్తున్నారు. జిల్లాలో ప్రస్తుతం ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, అన్ని రకాల గురుకులాలు కలిపి మొత్తం 1,168 ఉండగా.. వీటిలో 51,823 మంది విద్యార్థులు

మిగతా 8వ పేజీలో...

అర్ధాకలితో ప్రత్యేక తరగతులకు..

ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులు అర్ధాకలితో అలమటిస్తున్నారు. పాఠశాల సమయం పూర్తయిన తర్వాత అలసటతో ప్రత్యేక తరగతులకు హాజరవుతున్నారు. పాఠ్యాంశాలపై దృష్టి సారించలేకపోతున్నారు. సాయంత్రం పూట అల్పాహారం అందిస్తే విద్యార్థులకు ఉపయుక్తంగా ఉంటుంది. ఆ దిశగా ప్రభుత్వం, దాతలు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు స్పందించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

పాఠశాలలు

ప్రభుత్వ	ప్రైవేటు	మొత్తం
319	849	1168

విద్యార్థులు

ప్రభుత్వ	ప్రైవేటు	మొత్తం
16,908	34,915	51,823



రూ.36.43 కోట్లు విడుదల

రైతుల ఖాతాల్లో రైతు భరోసా సొమ్ము

- తొలిరోజు ఉమ్మడి జిల్లాలో 26,912 మందికి లబ్ధి

వికారాబాద్/మేడ్చల్, జనవరి 27(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రైతుభరోసా కింద తొలి రోజు ప్రభుత్వం ఉమ్మడి జిల్లాలో 26,912 మంది రైతుల ఖాతాల్లో రూ.36.43 కోట్లు జమ చేసింది.ఎన్నికల హామీల్లో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఆదివారం నాలుగు సంక్షేమ పథకాలను లాంఛనంగా ప్రారంభించిన సంగతి తెలిసిందే. గణతంత్ర దినోత్సవం రోజున రైతుభరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించింది. ముందుగా మండలానికి ఒక గ్రామాన్ని ఎంపిక చేసి ఆ గ్రామంలో లబ్ధిదారులకు వందశాతం పథకాలను అమలు చేయనున్నట్లు శనివారం ప్రకటించింది. ఎంపిక చేసిన గ్రామంలో పథకాల అమలు కోసం నలుగురు మండల స్థాయి అధికారులను నియమించి మార్చి 31వ తేదీ వరకు ఈ పథకాలన్నీ అమల్లోకి తెస్తామని తెలిపింది. ఇందులో భాగంగా ఎంపిక చేసిన ఆయా గ్రామాల్లోని రైతులందరికీ పెట్టుబడి సాయం(రైతు భరోసా) కింద తొలివిడత నిధులు విడుదల చేసి వారి ఖాతాల్లో నేరుగా జమ చేసింది. ఎకరానికి రూ. 12వేల వ్యవసాయ పెట్టుబడి సాయం అందిస్తున్న ప్రభుత్వం తొలివిడత ఎకరానికి రూ. 6వేల చొప్పున సోమవారం విడుదల నిధులు చేసింది. రంగారెడ్డి జిల్లాలో 15,597 మంది రైతులకు రూ.20.32 కోట్లు, వికారాబాద్ జిల్లాలో 8,609 మంది రైతులకు రూ.11.18 కోట్లు, మేడ్చల్ జిల్లాలో 2,706 మంది రైతులకు రూ.4.93 కోట్లు నేరుగా వారి ఖాతాల్లో జమ చేసింది. దశలవారీగా మిగతా రైతులకు కూడా రైతు భరోసా అందిస్తామని అధికారులు తెలిపారు. అదే విధంగా కొత్త పాస్‌బుక్‌లు పొందిన రైతులు రైతుభరోసా కోసం ఈనెల 28వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

జిల్లా	రైతులు	రైతుభరోసా (రూ.కోట్లలో)
రంగారెడ్డి	15,597	20.32
వికారాబాద్	8,609	11.18
మేడ్చల్	2,706	4.93

కోరిక తీర్చుకొని ఆపై హత్య



- అదనంగా డబ్బులు అడగడంతో ఘాతుకం
- వీడిన మహిళ మర్డర్ మిస్టరీ
- వివరాలు వెల్లడించిన మేడ్చల్ జోన్ డీసీపీ కోటిరెడ్డి

7

శివార్లలో అంతర్జాతీయ స్థాయి ఎకో ఫ్రెండ్లీ పార్కు



నేడు ‘ఎక్స్‌పీరియం’ పార్కును ప్రారంభించనున్న సీఎం రేవంత్‌రెడ్డి

- 150 ఎకరాల్లో 25వేల జాతుల మొక్కలు, చెట్లు
- అడుగడుగునా ప్రకృతి సోయగాలు



ప్రొద్దుటూరులోని ఎక్స్‌పీరియం

శంకర్‌పల్లి, జనవరి27(ఆంధ్రజ్యోతి): ప్రకృతి ప్రేమికుల కోసం నగర శివార్లలో నిర్మించిన అద్భుత, సుందరమైన అతిపెద్ద ఎకో ఫ్రెండ్లీ ‘ఎక్స్‌పీరియం’ పార్క్ నేడు సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభం కానుంది. రంగారెడ్డిజిల్లా శంకర్‌పల్లి మండలం ప్రొద్దుటూరు గ్రామంలో అంతర్జాతీయ స్థాయిలో నిర్మించిన పార్క్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, సినీ నటుడు మెగాస్టార్ చిరంజీవితో పాటు పలువురు ప్రముఖులు హాజరుకానున్నట్లు నిర్వాహకులు తెలిపారు. రామ్‌దేవ్‌రావు 150 ఎకరాలలో ఏర్పాటు చేసిన ఏకోఫ్రెండ్లీ ఎక్స్‌పీరియం పార్కులో ప్రపంచ వ్యాప్తంగా ఉన్న 25వేల జాతులకు సంబంధించిన మొక్కలు ఉన్నాయి. అర్జెంటీనా, ఉరుగ్వే, మెక్సికో, సౌత్ అమెరికా, స్పెయిన్, ఇటలీ, న్యూగినియా, ఆస్ట్రేలియా, థాయ్‌లాండ్, ఇండోనేషియా, మలేషియా తదితర దేశాల నుంచి అరుదైన మొక్కలు, చెట్లు, రకరకాల స్టోన్స్, అందమైన శిలలు సేకరించి గార్డెన్‌ను ఏర్పాటు చేశారు. దీని కోసం ఆయన సుమారుగా రూ. 150కోట్లు ఖర్చు చేశారు. అందమైన ఒక్కో శిల్పానికి ఆయన రూ. 5లక్షల నుంచి రూ.కోటి వరకు ఖర్చు చేశారు. 1500 మంది కూర్చునేలా ఇండియాలోనే అతిపెద్ద హంపీ థియేటర్‌ను ఏర్పాటు చేశారు. అదే విధంగా 30 అడుగుల ఎత్తులో 20స్టెయిన్ లెస్ స్టీల్ శిల్పాలు ఏర్పాటు చేసి వాటిని ఎంతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. అలాగే రూ. 50కోట్లతో 12 ఎకరాలలో మ్యాన్‌మేడ్ బీచ్ ఏర్పాటు చేశారు. 40గదులు మరియు 20 కాటేజీలతో కూడిన సుందరభరితమైన సహజ రిసార్టు ద్వీపంగా తీర్చిదిద్దారు. ప్రీవెడ్డింగ్, పోస్టు వెడ్డింగ్, ఫోటో షూట్‌లకు ఎక్స్‌పీరియంను రామ్‌దేవ్‌రావు ఎంతో శ్రమకోర్చి తీర్చిదిద్దారు. దేశానికి గర్వకారణంగా, రాష్ట్ర ప్రతిష్ఠకు చిహ్నంగా హైదరాబాదుకు ఒక ఐకానిక్‌గా ఎక్స్‌పీరియం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

బాలాజీ ఆలయంలో రేపు రథోత్సవం



చేవెళ్ల, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): చేవెళ్ల పట్టణ కేంద్రంలోని లక్ష్మీ బాలాజీ ఆలయ రథోత్సవం ఈనెల 29వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త దేవుని వామనాచార్యులు తెలిపారు. సోమవారం చేవెళ్లలో వివరాలు వెల్లడించారు. ఏటా నిర్వహించే స్వామివారి రథోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చన, స్వామి వారి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. సోమవారం రాత్రి మహా అన్నదాన కార్యక్రమం చేపడుతున్నామన్నారు. రథోత్సవం మధ్యాహ్నం 3గంటలకు ఆలయం నుంచి చేవెళ్ల వరకు కొనసాగుతుందని తెలిపారు. ప్రజాప్రతినిధులు, గ్రామపెద్దలు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

అధికారులు బాధ్యతగా ఉండాలి

పారిశుధ్యం, తాగునీటిపై దృష్టి సారించాలి

- నర్సరీల నిర్వహణపై ప్రత్యేక చొరవ చూపాలి
- జిల్లా పరిషత్ సీఈవో కృష్ణారెడ్డి



రికార్డులను పరిశీలిస్తున్న జెడ్పీ సీఈవో కృష్ణారెడ్డి

యాచారం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలలో పారిశుధ్యం, తాగు నీటి సమస్య రాకుండా అప్రమత్తంగా ఉండాలని జిల్లా పరిషత్ సీఈవో కృష్ణారెడ్డి పేర్కొన్నారు. సోమవారం యాచారం మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో ఆయన సమావేశమయ్యారు. అధికారులు బాధ్యతగా పని చేయాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు మురుగు కాలువలను రోడ్లపై చెత్తను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని ఆదేశించారు. రాబోయే వేసవిలో తాగు నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. తాగునీరు కలుషితం కాకుండా పైప్ లైన్ల లీకేజీలకు మరమ్మతులు చేపట్టాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు సూచించారు. నర్సరీలలో పెంచుతున్న మొక్కలను సంరక్షించాలన్నారు. గతంలో నాటిన మొక్కలు ఎండిపోకుండా విధిగా నీరందించాలని తెలిపారు. ఉపాధి కూలీలకు పనులు కల్పించడానికి కృషి చేయాలన్నారు. పంచాయతీ కార్యాలయాలు, అంగన్‌వాడీ కేంద్రాలలో మూత్రశాలలు, మరుగుదొడ్లకు నీటి వసతి ఉండేలా చూడాలన్నారు. ప్రజాపాలనలో ప్రజల నుంచి అందిన ఫిర్యాదులపై విచారణ చేసి అర్హులకు ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలని ఎంపీడీవో నరేందర్ రెడ్డి సూచించారు. సమావేశంలో ఎంపీవో శ్రీలత తదితరులున్నారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో జెడ్పీ సీఈవో రికార్డులు పరిశీలించారు. కాగా కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ కృష్ణ రోడ్డు ప్రమాదంలో గాయపడిన విషయం జెడ్పీ సీఈవో దృష్టికి తీసుకురావడంతో బాధితుడికి అండగా ఉంటామని, మెరుగైన వైద్యసాయం అందించడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.



సమస్య వింటున్న కలెక్టర్ నారాయణరెడ్డి

ఉత్తమ ఫలితాలు సాధించాలి

- కలెక్టర్ నారాయణరెడ్డి

రంగారెడ్డి అర్బన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : రానున్న ఇంటర్మీడియెట్, పదో తరగతి పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాలలు, హాస్టల్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా ప్రత్యేక తరగతులు నిర్వహించాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి ఆదేశించారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమం అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా రాష్ట్రంలోనే ఉత్తమ స్థానంలో నిలిచేలా అధికారులు, ఉపాధ్యాయులు కృషి చేయాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన నాలుగు పథకాల వివరాలు పంచాయతీల వారీగా, మున్సిపాలిటీల వార్డుల వారీగా నమోదు చేయాలన్నారు. ఈ సందర్భంగా ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి ఆయన వినతులు స్వీకరించారు. ప్రజావాణిలో మొత్తం 87 ఫిర్యాదులు వచ్చాయి. అందులో రెవెన్యూశాఖకు సంబంధించి 51 రాగా, ఇతర శాఖలవి 16 ఫిర్యాదులు అందాయి. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు, తహసీల్దారులు, కలెక్టరేట్ సూపరిండెంట్లు పాల్గొన్నారు.

చేవెళ్ల మున్సిపాలిటీలో ఊరెళ్లను కలపొద్దు

- కలెక్టరేట్ ఎదుట గ్రామస్తుల ధర్నా
- కలెక్టర్‌కు వినతి పత్రం అందజేత



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న ఊరెళ్ల గ్రామస్తులు

రంగారెడ్డి అర్బన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : చేవెళ్ల మున్సిపాలిటీలో ఊరెళ్లను కలపొద్దని గ్రామస్తులు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం కలెక్టర్ నారాయణరెడ్డికి వినతి పత్రం సమర్పించారు. ఊరంతా వ్యతిరేకిస్తున్నా చేవెళ్ల మున్సిపాలిటీలో ఊరెళ్ల గ్రామాన్ని విలీనం చేయడం సరికాదన్నారు. చేవెళ్లకు కూత వేటు దూరంలో ఉన్న పామెన, కందాడ, పల్గుట్ట, మల్లారెడ్డిగూడ గ్రామాలను వదిలేసి 5కిలో మీటర్ల దూరంలో ఉన్న ఊరెళ్లను ఎలా కలుపుతారని ప్రశ్నించారు. మున్సిపాలిటీ ఏర్పాటు వల్ల ఎలాంటి అభివృద్ధి ఉండదని, ట్యాక్సులు పెరగడంతో పాటు ఇల్లు కట్టుకోవాలంటే కూడా సవాలక్ష ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. తమ గ్రామాన్ని చేవెళ్ల మున్సిపాలిటీ నుంచి తొలగించేంత వరకు ఉద్యమిస్తామని హెచ్చరించారు.



చిన్నారులకు పలకలు, పుస్తకాలు పంపిణీ చేస్తున్న రాఘవేందర్

సామాజిక సేవతోనే గుర్తింపు

కడ్తాల్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): సామాజిక సేవ, ప్రజా చైతన్య కార్యక్రమాలలో భాగస్వాములైనప్పుడే గుర్తింపు వస్తుందని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, యువజన సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఎర్రోళ్ల రాఘవేందర్ అన్నారు. కడ్తాల మండలం గొర్లకుంట తండా పాఠశాల విద్యార్థులకు సోమవారం పలకలు, నోట్ పుస్తకాలు, పెన్నులు సమకూర్చి ఆయన అందజేశారు. అలాగే పాఠశాల ఆవరణలో, కడ్తాల మండల కేంద్రంలో పలుచోట్ల యువజన సంఘాల సభ్యులతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో నాయకులు, యువజన సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న బొర్ర జ్ఞానేశ్వర్

ముదిరాజ్‌లు ఐక్యంగా ముందుకు సాగాలి

తెలంగాణ ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్ర జ్ఞానేశ్వర్

షాద్‌నగర్ అర్బన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): రాజకీయంగా, ఆర్థికంగా వెనుకబడిన ముదిరాజ్ కులస్తులు హక్కుల సాధన కోసం ఐక్యతగా ముందుకు సాగాలని తెలంగాణ ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్ర జ్ఞానేశ్వర్ పిలుపునిచ్చారు. షాద్‌నగర్ తాలుకా ముదిరాజ్ సంఘం 2025 సంవత్సరం క్యాలెండర్‌ను సోమవారం స్థానిక ఓ ఫంక్షన్ హాలులో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంఘాలు ఎన్ని ఉన్నా సమస్యల సాధన కోసం కలిసికట్టుగా ఉంటూ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆ తరువాత ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చేతుల మీదుగా కూడ ముదిరాజ్ సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరింపజేశారు. కార్యక్రమంలో నాయకులు అందె బాబయ్య, అందె మోహన్, మంగ వెంకటేష్, శ్రీధర్‌వర్మ, మంగ అశోక్, తుపాకుల శేఖర్, చెట్ల జంగయ్య, కొండె యాదయ్య, పిట్టల అంజయ్య, గడ్డమీది రమేష్, నలమోని శ్రీధర్, కడుముల బాల్‌రాజ్, గుర్రంపల్లి మల్లేష్, బుడ్డా నర్సింహ్మా, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు రంగారెడ్డి జిల్లా పురుషుల కబడ్డీ జట్టు ఎంపిక

ఎల్‌బీనగర్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో 85 కిలోల కేటగిరీలో పురుషుల విభాగానికి చెందిన జట్టును సరూర్‌నగర్‌లోని ఇండోర్ స్టేడియంలో మంగళవారం ఎంపిక చేయనున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.రవికుమార్, ప్రధాన కార్యదర్శి పి.సుధాకర్ రెడ్డి పేర్కొన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఫిబ్రవరి 4 నుంచి 7వ తేదీ వరకు ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని డైట్ కళాశాలలో నిర్వహించే 71వ సీనియర్ అంతర్ జిల్లా కబడ్డీ పోటీల్లో పాల్గొంటారన్నారు. ఆధార్ కార్డుతో జట్టు ఎంపికలో పాల్గొనాలన్నారు.

కాంగ్రెస్ ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్‌గా నర్సింహ



నర్సింహకు నియామకపత్రం అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మహేశ్వరం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేస్తూ వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చటాలని మాజీ ఎమ్మెల్యే కాంగ్రెస్ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. కాంగ్రెస్ ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్‌గా నియమితులైన నందిగామ నర్సింహకు సోమవారం సంబంధిత నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలుచేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు అర్హులైన పేదలకు చేరవేయడంలో కార్యకర్తలు క్రుషి చేయాలన్నారు. కష్టపడే కార్యకర్తలను కాంగ్రెస్ ఎప్పుడూ మరిచిపోదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో మాట్లాడి మహేశ్వరం నియోజకవర్గాన్ని రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి చేసుకుందామన్నారు. త్వరలో అన్ని గ్రామాల్లో ఇందిరమ్మ కమిటీలు వేస్తామని, ప్రభుత్వ పథకాలను అర్హులైన వారికి చేరవేయడంలో కమిటీ సభ్యులకే ఉంటుందన్నారు. కాంగ్రెస్ ఎస్సీసెల్ రాష్ట్ర కన్వీనర్‌గా బాధ్యతలు తీసుకున్న నర్సింహ పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్, ప్రీతం, కేఎల్లార్, దేప భాస్కర్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు దేప భాస్కర్‌రెడ్డి, బొక్క జంగారెడ్డి, వత్తుల రఘుపతి, రాజునాయక్, ఇబ్రాయేలు, ప్రవీణ్, భాస్కర్ పాల్గొన్నారు.

రుద్ర సహిత చండీ యాగంలో మాజీ మంత్రులు



దాసర్లపల్లిలో రుద్ర సహిత శత చండీయాగంలో
మాజీ మంత్రులు హరీశ్‌రావు, సబితాఇంద్రారెడ్డి, దయాకర్‌రావు

కందుకూరు,జనవరి 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని దాసర్లపల్లిలో రేవల్లి జనార్దనశర్మ వ్యవసాయ క్షేత్రంలో రుద్ర సహిత శత చండీయాగం సోమవారం రెండో రోజు అత్యంత వైభవంగా జరిగింది. వేద పండితులు రాజుశర్మ ఆధ్వర్యంలో మంగళవారం వరకు 108 యజ్ఞగుండాల్లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు వేలసంఖ్యలో పాల్గొన్నారు. సోమవారం మాజీ మంత్రులు హరీశ్‌రావు, సబితాఇంద్రారెడ్డి, దయాకర్‌రావు, ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యే జైపాల్‌రెడి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వేదపండితులు రాజుశర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన శివపార్వతుల కల్యాణంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ దైవ చింతనతో ఉండాలన్నారు. కార్యక్రమంలో మండల సహకార సంఘం చైర్మన్ చంద్రశేఖర్, ఏఎంసీ మాజీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు లక్ష్మీనర్సింహారెడ్డి, రామకృష్ణారెడ్డి, బాలమణిఅశోక్, మాజీ ఎంపీటీసీ ఇందిరదేవేందర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఊరడమ్మ బోనాలు



అమ్మవారికి నైవేద్యం సమర్పించేందుకు బోనాలతో బయల్దేరిన మహిళలు

పెద్దేముల్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని రుద్రారం, గాజీపూర్ గ్రామాల్లో సోమవారం గ్రామదేవత(ఊరడమ్మ)జాతర నిర్వహించారు. మహిళలు సాయంత్రం వేళ అమ్మవారికి నైవేద్యాలు సమర్పించేందుకు బోనాలతో బయలుదేరారు. ప్రధానవీధుల గుండా ర్యాలీగా బయలు దేరగా బోనాల ముందు పోతురాజులు చేసిన సందడి అందరిని ఆకర్శించాయి. డప్పు చప్పుళ్ళ మధ్యన అమ్మవారి ఆలయానికి చేరుకుని ప్రదక్షిణలు చేసి నైవేద్యాలు సమర్పించారు. అనంతరం ఏర్పులమ్మ భవిష్యవాణి వినిపించారు.

బాడీ బిల్డింగ్‌లో సత్తా చాటిన పూజారి కొడుకు



అభిషేక్ స్వామిని సన్మానిస్తున్న డాక్టర్ సంపత్ కుమార్, సునీతా సంపత్

తాండూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): పాత తాండూరు కోటేశ్వర ఆలయం పూజారి చంద్రశేఖర్ స్వామి కుమారుడు అభిషేక్‌స్వామి రాష్ట్రస్థాయిలో జరిగిన బాడీ బిల్డింగ్ పోటీల్లో గోల్డ్‌మెడల్ సాధించి సత్తాచాటాడు. బీవీజీ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ సంపత్‌కుమార్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ సునీతాసంపత్‌లు సోమవారం అభిషేక్‌ను సన్మానించారు. రాష్ట్ర స్థాయిలో బాడీ బిల్డింగ్ పోటీలో 55 కేజీల విభాగంలో గోల్డ్‌మెడల్, మ్యాన్ ఫిజిక్ విభాగంలో కాంస్య పతకం సాధించి తాండూరు పేరును అభిషేక్ నిలబెట్టాడు. అభిషేక్‌ను డాక్టర్ సంపత్ కుమార్ దంపతులు అభినందించారు. ఈ కార్యక్రమంలో బీవీజీ ఫౌండేషన్ సభ్యులు లింగదళి రవికుమార్, మహేష్ ఠాకూర్, సంజీవ్, కోట్ల రాజ్‌కుమార్, నాగు, తదితరులు ఉన్నారు. అదేవిధంగా బీసీ సంఘం ఆధ్వర్యంలో జాతీయ బీసీ కార్యవర్గ సభ్యులు కందుకూరి రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో అభిషేక్‌ను ఘనంగా సన్మానించారు.

జెడ్పీ హైస్కూల్‌ను గురుకులంలో విలీనం చేయాలి



వినతిపత్రాలు చూపుతున్న నాయకులు

ఘట్‌కేసర్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్ జిల్లా పరిషత్ బాలికల, బాలుర పాఠశాలల్ని గురుకల పాఠశాల (ఎయిడెడ్) విలీనం చేసి హైస్కూల్‌తో పాటు కళాశాలను ఏర్పాటు చేయాలని మాజీ సర్పంచ్ అబ్బసాని యాదగిరి డిమాండ్ చేశారు. ఘట్‌కేసర్‌లోని గురుకుల్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సువిశాల గురుకుల్ పాఠశాలలో జడ్పీ పాఠశాలలను విలీనం చేసి జడ్పీపాఠశాలల స్థలాన్ని బస్టాండ్ విస్తరణకు కేటాయించాలన్నారు. ఘట్‌కేసర్ పట్టణం రోజురోజుకు అభివృద్ధి చెందుతున్నదని దీంతో ఘట్‌కేసర్ బస్టాండ్ ఏమాత్రం సరిపోవడం లేదన్నారు. గురుకుల్‌లో జడ్పీ పాఠశాలలను విలీనం చేయాలని కోరుతూ రాష్ట్ర ముఖ్యమంత్రితోపాటు మంత్రులకు, ఎమ్మెల్యేలకు వినతిపత్రాలతోపాటు ఉత్తరాలు, పోస్టుకార్డులను పంపుతున్నట్లు తెలిపారు.

కోరిక తీర్చుకొని ఆపై హత్య

- డబ్బులు అడగడంతో ఘాతుకం
- వీడిన మహిళ మర్డర్ మిస్టరీ
- ఛేదించిన మేడ్చల్ పోలీసులు
- వివరాలు వెల్లడించిన డీసీపీ



మీడియా సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ కోటిరెడ్డి

పేట్‌బషీరాబాద్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): మేడ్చల్ జిల్లా మునిరాబాద్ ఔటర్ రింగ్‌రోడ్డు కల్వర్టు కింద 24న జరిగిన మహిళ హత్యకేసును మేడ్చల్ పోలీసులు ఛేదించారు. ఈ మేరకు మేడ్చల్ జోన్ డీసీపీ కోటిరెడ్డి సోమవారం వివరాలు వెల్లడించారు. ఆ మహిళ నిజామాబాద్ బోధన్‌కి చెందిన శివానందగా గుర్తించారు. ఆమెకు ముగ్గురు పిల్లలు ఉన్నట్లు తెలిపారు. ఆమె కుటుంబ సభ్యులతో గొడవపడి కుషాయిగూడలో కూలి పనులు చేసుకుంటుంది. మేడ్చల్ బస్‌స్టాండ్‌లో శివానంద ఉండగా నిందితుడు కరీంనగర్ జిల్లా కమలాపురానికి చెందిన షేక్ ఇమామ్(37) శామీర్‌పేట్‌లోని మజీద్‌పుర్‌లో నివాసం ఉంటూ కటింగ్‌స్టోన్ కంపెనీలో పనిచేస్తున్నాడు. మేడ్చల్ బస్టాండ్‌వద్ద నిలబడిన ఆ మహిళను చూసి కోరిక తీర్చుకొనేందుకు అడుగ్గా ఆమె కూడా అంగీకరించింది. ఇద్దరు కలసి బండిపై మునిరాబాద్ వద్ద కల్వర్ట్ వద్దకు వెళ్లారు. కోరిక తీర్చుకున్న తర్వాత మహిళకు రూ.500 ఇచ్చాడు. ఆమె మరికొంత డబ్బు అడుగ్గా ఇద్దరిమధ్య గొడవ జరిగింది. కోపోద్రిక్తుడైన ఇమామ్.. శివానంద మెడను గట్టిగా పట్టుకోవడంతో అపస్మారక స్థితికి వెళ్లింది. ఆపై బండరాయితో తలపై కొట్టి చంపి పెట్రోల్‌పోసి నిప్పంటించి పరారయ్యాడు. స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మేడ్చల్ పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి ఆధారాలు సేకరించారు. ఆమె కుడిచేతిపై తెలుగులో ఆర్.శ్రీకాంత్, ఇంగ్లీష్‌లో రోహిత్, ఎడమచేతిపై నరేంద్ర అనే మూడు టాటూలు ఉన్నాయి. ఈ వార్త గుప్పుమనగా గుర్తుపట్టిన బంధువులు మేడ్చల్ పోలీసులను ఆశ్రయించారు. దీంతో కేసు నమోదు చేసుకొన్న పోలీసులు కెమెరాల సహాయంతో మజీద్‌పూర్ వద్ద నిందితుని అరెస్ట్ చేసి ఫోన్‌ను స్వాధీనం చేసుకొన్నారు. కార్యక్రమంలో మేడ్చల్ సీఐ సత్యనారాయణ, దుండిగల్ సీఐ సతీష్, జీనోమ్‌వ్యాలీ సీఐ వెంకటరెడ్డి, మేడ్చల్ ఎస్ఓటీ సీఐ శ్యాంసుందర్‌రెడ్డి, మేడ్చల్ డీఐ సుధీర్‌కృష్ణ, సీసీఎస్ బాలానగర్ సీఐ డీటీ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసేవకు అంకితభావంతో పనిచేయాలి



ఘట్‌కేసర్ మున్సిపాలిటీ వీడ్కోలు సమావేశంలో మాట్లాడుతున్న మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్

మేడ్చల్ టౌన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): రాజకీయ రంగంలో రాణించాలంటే పదవులతో ప్రమేయం లేకుండా ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలని మల్కాజ్గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. మేడ్చల్ మున్సిపల్ పాలకవర్గం సర్వసభ్య సమావేశం సోమవారం నిర్వహించారు. అనంతరం పాలకవర్గానికి వీడ్కోల సభను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. ప్రజాసేవ చేయదలచిన వారికి రాజకీయ రంగం గొప్ప అవకాశానిస్తుందన్నారు. పదవులను ఆశించకుండా ప్రజాసేవ చేసేవారికి తగిన గుర్తింపు లభిస్తుందన్నారు. మేడ్చల్ మున్సిపల్ ఏర్పడ్డ అనంతరం ప్రజలతో ఎన్నుకోబడిన మొదటి పాలకవర్గం తన పదవీకాలం పూర్తి చేసుకోవడం అభినందనీయమన్నారు. ఐదేళ్ల పాలనలో మేడ్చల్ మున్సిపాలిటీ గణనీయంగా అభివృద్ధిని సాధించిందన్నారు. మేడ్చల్ అభివృద్ధికి తనవంతు పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. చైర్‌పర్సన్ మర్రి దీపిక నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. ఐదేళ్ల పాటు తనకు పూర్తి సహాయ సహకారాలు అందించిన పట్టణ ప్రజలకు, పాలక వర్గానికి, అధికారులకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. పాలకవర్గాన్ని సమన్మానించి వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి, కౌన్సిలర్లు, బీజేపీ, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు పనులను పరిశీలించిన ఎంపీ

మేడ్చల్ పట్టణంలో చేపడుతున్న 44 నంబర్ జాతీయ రహదారి అభివృద్ధి పనులను ఎంపీ ఈటల పరిశీలించారు. రోడ్డు నిర్మాణంతో స్థానికులు పడుతున్న ఇబ్బందుల గురించి స్థానిక బీజేపీ నేతలు ఈటల దృష్టికి తీసుకెళ్లగా సంబంధిత అధికారులతో మాట్లాడి రోడ్డు సమస్యలను పరిష్కరించటానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రూరల్ జిల్లా అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి, పట్టణ బీజేపీ అధ్యక్షురాలు శైలజ తదితరులు పాల్గొన్నారు.

పదవులు లేకున్నా ప్రజల్లో ఉండేవారే నాయకులు

ఘట్‌కేసర్: పదవులు ఉన్నా లేకున్నా ప్రజల్లో ఉండేవారే నాయకులు అని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. ఘట్‌కేసర్‌లోని నారాయణ గార్డెన్‌లో సోమవారం మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ముల్లి పావని అధ్యక్షతన మున్సిపల్ పాలకవర్గం వీడ్కోలు సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. ప్రజాసమస్యలు ఉన్నంతకాలం నాయకులు సమస్యల పరిష్కారానికి పనిచేయాల్సి ఉంటుందన్నారు. కరోనా సమయంలో ప్రజాప్రతినిధులు ప్రజలకు ధైర్యాన్ని అందించి వారికి అండగా నిలిచిన విషయం మరువలేనిదన్నారు. తాను రాష్ట్రానికి ఆర్థిక శాఖ మంత్రిగా పనిచేశానని అప్పట్లో 5, 10కోట్లు అంటే లెక్కలేకుండా ఉండేదన్నారు. అభివృద్ధి పనులకు వందల కోట్లు వెచ్చించినప్పటికీ ప్రస్తుతం నిధులు వెతుక్కోవాల్సిన పరిస్థితి ఉన్నదన్నారు. ఘట్‌కేసర్ గతంలో సందడిగా ఉండేదని, నేడు డు వెలవెలబోతున్నది దానికి రైల్వే వంతెనా లేక మరే సమస్య అయినా ఘట్‌కేసర్‌కు పూర్వ వైభవంను తీసుకురావడానికి పాటుపడతామన్నారు. అనంతరం మాజీ మున్సిపాలిటీ పాలకవర్గాన్ని సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్, డీసీసీ సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, మాజీ జడ్పీ చైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి, కమిషనర్ చంద్రశేఖర్, మేనేజర్ వెంకట్‌రెడ్డి, బీజేపీ నాయకుడు, విక్రంరెడ్డి, కాంగ్రెస్ నాయకులు మహేష్, రాజేష్, సుదర్శన్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, మాధవరెడ్డి పాల్గొన్నారు.

ఆస్తి పన్ను వసూళ్లు, ఎల్ఆర్ఎస్‌పై దృష్టి పెట్టండి

కమిషనర్లకు సీడీఎంఏ శ్రీదేవి ఆదేశం

తాండూరు, జనవరి 27(ఆంధ్రజ్యోతి): వందశాతం ఆస్తి పన్ను వసూళ్లపై దృష్టి సారించాలని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ డాక్టర్ టీకే శ్రీదేవి మున్సిపల్ కమిషనర్‌లను ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్లతో సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పలు అంశాలపై చర్చించారు. ఆస్తి పన్ను వసూళ్లు తక్కువగా ఉండటంతో కమిషనర్‌లను వేగం పెంచాలన్నారు. లేదంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. వికారాబాద్ జిల్లాలోని తాండూరు, కొడంగల్, పరిగి, వికారాబాద్ కమిషనర్‌లతో ఆమె విడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. తాండూరు ఆస్తి పన్ను వసూళ్లలో పూర్తిగా వెనుకబడి పోవడంపై ఆమె మండిపడ్డారు. ఎల్ఆర్ఎస్ ప్రక్రియను త్వరగా పూర్తిచేయాలన్నారు. ప్రభుత్వం నిర్ధేశించిన లక్ష్యాలకు అనుగుణంగా కమిషనర్‌లు పని చేయాలని సూచించారు. శానిటేషన్ మెరుగుపర్చాలన్నారు.

యువత వ్యాపార రంగాలపై దృష్టి సారించాలి



రెస్టారెంట్‌ను ప్రారంభిస్తున్న స్పీకర్ గడ్డం ప్రసాద్, వజ్రేష్‌యాదవ్

మూడుచింతలపల్లి, జనవరి 27(ఆంధ్రజ్యోతి) : యువత వ్యాపార రంగాలపై దృష్టిసారించి ఇతరులకు ఉపాధి కల్పించాలని తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తెలిపారు. మేడ్చల్ జిల్లా, మూడుచింతలపల్లి, పోతారం చౌరస్తాలో ఓ రెస్టారెంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత నూతన ఆలోచనలతో పరిశ్రమలు ఏర్పాటు చేసి ఇతరులకు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా ముందుకుసాగాలన్నారు. ప్రజలకు నాణ్యమైన రుచికరమైన ఆహారాన్ని అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్, మాజీ జడ్పీటీసీ హరివర్ధన్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ నర్సింహ్మలు యాదవ్, నాయకులు పాల్గొన్నారు.

హలో మాదిగ.. చలో మహేశ్వరం

- నేడు మహేశ్వరానికి మంద కృష్ణ మాదిగ
- ఎమ్మెస్పీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు రావుగల్ల బాబు



నినాదాలు చేస్తున్న ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ నాయకులు

మహేశ్వరం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ అంతిమ లక్ష్య సాధనలో భాగంగా నిర్వహించే హైదరాబాద్ సదస్సుకు వేల గొంతులు, లక్ష డప్పులతో చీమల దండులా కదం తొక్కాలని ఎమ్మెస్పీ జిల్లా అధ్యక్షుడు రావుగల్ల బాబు మాదిగ పిలుపునిచ్చారు. ఎమ్మార్పీఎస్ మండల బాధ్యులు బక్కని రవి, మండలాధ్యక్షుడు ఎర్ర గణేష్ మాదిగల ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. ఎస్సీ ఏబీసీడీ వర్గీకరణ జరిగితేనే 59 ఉపకులాలకు సమ న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమ విజయవంతానికి మహేశ్వరంలో నిర్వహించే సన్నాహక సమావేశానికి ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ హాజరవుతున్నారన్నారు. ఆయా ఏర్పాట్లను సోమవారం పరిశీలించారు. దేశమంతా ఎస్సీ వర్గీకరణ న్యాయమంటుంటే కొందరు మాల సామాజికవర్గానికి చెందిన స్వార్థపరులు వర్గీకరణను వ్యతిరేకిస్తూ కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. మహేశ్వరానికి మంద కృష్ణ హాజరవుతుండడంతో జిల్లాలోని మాదిగలంతా సంకకు డప్పు వేసుకొని దండోరా మోగిస్తూ తరలిరావాలన్నారు. 30 ఏళ్ల సుదీర్ఘ పోరాట ఫలితంగా సుప్రీం కోర్టు ఎస్సీ వర్గీకరణకు అనుకూల తీర్పునిచ్చిందన్నారు. ఫిబ్రవరి 7న హైదరాబాదులో నిర్వహించే సభకు చీమల దండులా మాదిగలు ఆట పాటలు, డప్పుల దరువులతో భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ నాయకులు రామ్‌చందర్, వత్తుల రఘుపతి, చంద్రయ్య, నందం, బక్కని రవి, గణేష్, నర్సింహ, మద్దిలేటి మాదిగ, ప్రశాంత్, ఆగమయ్య, జంగయ్య, స్వామి, ఉపేంద్ర, శంకరయ్య, మహేందర్, రమేష్, అర్జున్, స్వామి పాల్గొన్నారు.

యువ ఇంజినీర్లకు ఉజ్వల భవిష్యత్తు

భారత ఎంఎస్ఎంఈ డీజీ గ్లోరీ స్వరూప



ఆవిష్కరణలను వీక్షిస్తున్న భారత ఎంఎస్ఎంఈ డీజీ గ్లోరీ స్వరూప

ఘట్‌కేసర్ రూరల్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): భారత్‌లో యువ ఇంజనీర్లకు ఉజ్వల భవిష్యత్తు ఉందని భారత ఎంఎస్ఎంఈ డైరెక్టర్ జనరల్ గ్లోరీ స్వరూప అన్నారు. మేడ్చల్ జిల్లా పోచారం మున్సిపాలిటీ, వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో నిర్వహించిన తేజస్ 2కె25 ప్రాజెక్ట్ ఎక్స్పో సదస్సును సోమవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంజనీరింగు విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మక ఆలోచనలను ప్రోత్సహించడానికి తేజస్ 2కె25 ప్రాజెక్ట్ ఎక్స్పో దోహదపడుతుందన్నారు. యువ ఇంజనీర్లు నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలన్నారు. విద్యార్థులు కొత్త కొత్త విషయాలపై పరిశోధనలు చేయాలని సూచించారు. భారత ప్రభుత్వ 'ది ఇన్నోవేటివ్ స్కీమ్'ను ఉపయోగించుకొని 15 నుంచి 20 లక్షల వరకు ప్రభుత్వ గ్రాంటు పొందాలని విద్యార్థులకు సూచించారు. గతేడాది 160 ఆవిష్కరణలు ప్రదర్శించినట్లు గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రభుత్వ మాజీ ఇన్నోవేషన్ ఆఫీసర్ డాక్టర్ శాంతాతౌటం, టెక్నిప్ ఎఫ్ఎంసీ కంట్రీ హెడ్ అర్జున్ కుమార్, అనురాగ్ యూనివర్సిటీ సీఈవో సూర్యదేవర నీలిమా, చాన్సలర్ యూబీ దేశాయ్, వైస్‌చాన్సలర్ డాక్టర్ అర్చన మంత్రి, డీన్ విజయ్‌కుమార్, బాలాజీ ఉట్ల, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

గొల్ల, కురుమలు ఆర్థికంగా రాణించాలి



ఘట్‌కేసర్ రూరల్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): గొల్లకురుమలు ఆర్థికంగా రాణించాలని జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి సుధాకర్ తెలిపారు. కలెక్టరేట్‌లో సోమవారం గొర్రెల, మేకల పెంపకందారుల జిల్లా సంఘం-2025 డైరీని ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గొర్రెల, మేకల పెంపకందారుల సంఘం జిల్లా అధ్యక్షుడు మేకల కుమార్, కార్యదర్శి ఎక్కలదేవి కొమురయ్య, సభ్యులు భవన వెంకటేష్, బోదారి నర్సింహ, అశోక్, మల్లేష్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

తాండూరు డిప్యూటీ తహసీల్దార్‌గా లలిత



తాండూరు రూరల్, జనవరి 27, (ఆంధ్రజ్యోతి): తాండూరు డిప్యూటీ తహసీల్దార్‌గా లలిత బాధ్యతలు చేపట్టారు. ఇంతకాలం ఇక్కడ పనిచేసిన సందీప్‌కుమార్ సబ్ కలెక్టర్ కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఈ మేరకు సోమవారం సబ్‌కలెక్టర్ కార్యాలయం ధరణి విభాగంలో పనిచేస్తున్న లలితను తాండూరు డిప్యూటీ తహసీల్దార్‌గా బదిలీ చేశారు. ఈ సందర్భంగా ఆమె డీటీగా బాధ్యతలు స్వీకరించారు.

నిధుల కోసం కొట్లాడుదాం



బీసీ శ్మశాన వాటికను పరిశీలిస్తున్న జాతీయ బీసీ కార్యవర్గ సభ్యులు రాజ్‌కుమార్

తాండూరు, జనవరి 27(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఉన్న బీసీ, ఎస్సీల శ్మశాన వాటికల అభివృద్ధికి కావాల్సిన నిధుల కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు కదిలి రావాలని బీసీసంఘం నేతలు పిలుపునిచ్చారు. పట్టణంలోని పోలీస్ స్టేషన్‌లో వెనకల, పాత తాండూరు బోనమ్మ గుడి వద్ద ఉన్న బీసీ శ్మశాన వాటికలు, సీతారాంపేట్‌లోని ఎస్సీ శ్మశాన వాటికలను బీసీ నాయకులు సోమవారం సందర్శించారు. ఈ శ్మశాన వాటికల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి నిధులు కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ కార్యవర్గ సభ్యులు కందుకూరి రాజ్‌కుమార్, ఎర్రం శ్రీధర్, రాము, అశోక్, గిరిజపూరం రమేష్, జుంటుపల్లి వెంకట్, దుబాయి వెంకట్, శ్రీనివాస్, శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

వికారాబాద్ ఎక్సైజ్ సూపరింటెండెంట్‌కు ప్రశంస



డీఐజీ నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న సూపరింటెండెంట్ విజయ్ భాస్కర్

వికారాబాద్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ కె.విజయ్ భాస్కర్ నేతృత్వంలోని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సిబ్బంది తమ ఉత్తమ పనితీరుతో రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు పొందారు. గణతంత్ర సంబురాల్లో భాగంగా రాష్ట్ర ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డైరెక్టర్ ఆఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీఐజీ కమల్ హాసన్‌రెడ్డి హైదరాబాద్‌లోని కార్యాలయంలో జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ విజయభాస్కర్‌కు ప్రశంసాపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐ కె.శ్రీనివాస్, డీటీఎఫ్ ప్రేమ్‌కుమార్, ఎస్ఐలు సురేష్ రాథోడ్, నిజాం, విష్ణువర్ధన్‌రెడ్డి, కానిస్టేబుళ్ల హనుమంతులు ఉన్నారు.

పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి

ఆమనగల్లు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): పురాతన ఆలయాలు, పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. కల్వకుర్తి నియోజకవర్గంలోని పలు ఆలయాలను పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చేయడానికి రూ.50 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపగా మొదటి విడత కడ్తాల మండలం మైసిగండి మైసమ్మ ఆలయానికి రూ.5 కోట్లు విడుదలైనట్లు తెలిపారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో సోమవారం ఆలయాల అభివృద్ధి, ఆలయాల బ్రహ్మోత్సవాలపై నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమనగల్లు మండలం శెట్టిపల్లి గ్రామంలో ఫిబ్రవరి 2 నుంచి 6వ తేదీ వరకు నిర్వహించే వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను కాంగ్రెస్ జిల్లా నాయకుడు ఎగిరిశెట్టి సత్యం, ఆలయ చైర్మన్ సింగిని శ్రీనివాస్, మాజీ సర్పంచ్ గోదాదేవితో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు ఎగిరిశెట్టి బుచ్చయ్య, జంగయ్యగౌడ్, రవి, నరేశ్, వంశి, వెంకటేశ్, జంగాచారి పాల్గొన్నారు. కడ్తాల సమీపంలోని దాసర్లపల్లిలో నిర్వహించిన యజ్ఞంలో పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, మార్కెట్ వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి, కాంగ్రెస్ జిల్లా నాయకుడు యాచారం వెంకటేశ్వర్లు గౌడ్ తదితరులు పాల్గొన్నారు. తలకొండపల్లి మండల కేంద్రంలో అనారోగ్యంతో మృతి చెందిన మాజీ సర్పంచ్ ఈటమోని జంగయ్య యాదవ్ మృతదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఆధ్యాత్మిక చింతనతో ఆనందమయ జీవనం

తలకొండపల్లి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక చింతనలో ఉన్న వారు ఒత్తిళ్లను అధిగమించి ఆనందమయ జీవితాన్ని పొందుతారని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్‌యాదవ్ అన్నారు. తలకొండపల్లి మండలం వెల్జాల వేదాద్రి గుట్టపై ఫిబ్రవరి 7 నుంచి 9వ తేదీ వరకు కొనసాగే బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై నిర్వాహకులు సోమవారం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను ఆలయ ధర్మకర్త శ్రీనివాస మూర్తి ఆధ్వర్యంలో నాయకులు జైపాల్ యాదవ్‌కు అందజేశారు. మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్‌యాదవ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ చర్ల వెంకట్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ అంబాజీ, నాయకులు అశోక్‌బాబు, నర్సింహులు పాల్గొన్నారు.

మాట నిలబెట్టుకున్న సీఎం రేవంత్‌రెడ్డి



సురేందర్‌రెడ్డి, సర్దార్‌నగర్ మార్కెట్ చైర్మన్

షాబాద్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఇచ్చిన మాట నిలబెట్టుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం, ప్రజాపాలనలో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రైతు భరోసా డబ్బులు ఎట్లఎర్రవల్లి గ్రామ రైతుల ఖాతాలో జమ చేసినట్లు సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పీసరి సురేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం పైలెట్ ప్రాజెక్టు కింద షాబాద్ మండల పరిధిలోని ఏట్లఎర్రవల్లి గ్రామాన్ని ఎంపిక చేసి గ్రామంలోని 573 మంది రైతులకు రైతు భరోసా డబ్బులు రూ.64 లక్షల 45 వేలు రైతుల ఖాతాలో జమ చేసిందన్నారు. ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్‌కార్డుల మంజూరు సైతం త్వరలో చేస్తామన్నారు. ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను అమలు చేస్తుందన్నారు.

పోమాల్‌పల్లి రైతులకు అందిన రైతు భరోసా

కేశంపేట, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతి మండలానికి ఓ గ్రామంలో నాలుగు పథకాలను ప్రారంభించింది. కేశంపేట మండలంలో పోమాల్‌పల్లి గ్రామాన్ని ఎంపిక చేశారు. సీఎం రేవంత్ రెడ్డి చెప్పినవిధంగా సోమవారం రైతల ఖాతాల్లో రైతు భరోసా నిధులు జమ అయ్యాయి. పోమాల్‌పల్లి రెవెన్యూ పరిధిలోని పోమల్‌పల్లి, కొండారెడ్డిపల్లి గ్రామాల్లో 1215 మంది రైతులు ఉన్నారు. ఇందులో ఇద్దరికి 40 ఎకరాలకు పైగా ఉంది. చాలమంది 15 ఎకరాల్లోపు ఉన్నారు. సోమవారం 10 ఎకరాలు ఉన్న రైతులకు రైతు భరోసా అందినట్లు సమాచారం. పోమాల్‌పల్లి గ్రామానికి చెందిన అనుమగళ్ల రమేష్ తనకున్న ఐదు ఎకరాల 12 గంటలకు రూ.31,800 జమ అయినట్లు ఆంధ్రజ్యోతికి తెలిపారు. మండలంలోని మిగతా గ్రామాల రైతుల తమకు రైతు భరోసా వెంటనే ఇవ్వాలని కోరుతున్నారు.

జంగయ్య మృతిపై ప్రముఖుల సంతాపం

తలకొండపల్లి , జనవరి 27 (ఆంధ్రజ్యోతి): తలకొండపల్లి మాజీ సర్పంచ్ ఈటమోని జంగయ్య మృతిపై పలువురు ప్రజా ప్రతినిధులు, నాయకులు సంతాపం తెలిపారు. అనారోగ్యంతో మృతి చెందిన జంగయ్య భౌతికకాయాన్ని సోమవారం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్ యాదవ్, మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్ యాదవ్, మాజీ మార్కెట్ చైర్మన్ నాలాపురం శ్రీనివాస్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్, పీఏసీఎస్ చైర్మన్ గట్ల కేశవ రెడ్డి సందర్శించి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. జంగయ్య సేవలను గుర్తు చేసుకున్నారు. నాయకులు డోకూరు ప్రభాకర్‌రెడ్డి, మోహన్ రెడ్డి, జ్యోతయ్య, వెంకటయ్య, గోపాల్‌నాయక్, శంకర్, రాములు, చంద్రయ్య, యాదయ్య, శేఖర్, శ్రీరామ్, గోవర్ధన్, ఉన్నారు.

రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోవాలి

కేశంపేట, జనవరి 27(ఆంధ్రజ్యోతి): రైతు భరోసాకు నూతన పట్టాదారు పాసుపుస్తకాలు పొందిన రైతులు ఈ నెల 31 వరకు దరఖాస్తులు చేసుకోవాలని కేశంపేట మండల వ్యవసాయధికారిణీ శిరీష సోమవారం తెలిపారు. పథకం అమలులో భాగంగా జనవరి 1, 2025 వరకు నూతనంగా పట్టాదారు పాసుపుస్తకాలు పొందిన వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకునే వారు తమ గ్రామ పరిధిలోని ఏఈవోలను వారి రైతు వేదికలలో వివరాలు ఇవ్వాలని సూచించారు. దరఖాస్తు చేసుకునే రైతులు నూతన పట్టాదారు పాసుపుస్తకం, పాసుపుస్తకం రాని వారు ఆన్‌లైన్ కాపీ, ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా వివరాల ఫోటో కాపీలను జత చేయాలని సూచించారు.

మందకృష్ణ మాదిగకు సన్మానం

ఇబ్రహీంపట్నం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత మందకృష్ణ మాదిగను సోమవారం ఇబ్రహీంపట్నంకు చెందిన పలువురు నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మాదిగ జేఏసీ జిల్లా గౌరవాధ్యక్షుడు బోసుపల్లి ప్రతాప్, నియోజకవర్గ అధ్యక్షుడు భాస్కర్, బండమీది కృష్ణ, పల్లాటి యాదయ్య, బోడ అబ్బయ్య, శ్రీకాంత్, సుధాకర్ ఆయన నివాసంలో కలిసి అభినందనలు తెలిపారు.

చేవెళ్ల: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగకు పద్మశ్రీ అవార్డు రావడం అభినందనీయమని ఎమ్మార్పీఎస్ చేవెళ్ల వ్యవస్థాపక అధ్యక్షుడు, చేవెళ్ల మాజీ ఉప సర్పంచ్ గంగి యాదయ్య అన్నారు. మాదిగల కోసం. ఎస్సీ వర్గీకరణ కోసం మందకృష్ణ మాదిగ సేవలను కేంద్ర ప్రభుత్వం గుర్తించి పద్మశ్రీ అవార్డుకు ఎంపిక అభినందనీయమన్నారు.

చేవెళ్ల: మంద కృష్ణమాదిగను బీజేపీ నాయకులు ఘనంగా సన్మానించారు. హైదరాబాద్ లోని మంద కృష్ణ నివాసానికి వెళ్లి శుభాకాంక్షలు తెలిపి ఘనంగా సన్మానించారు. బీజేపీ చేవెళ్ల మండల అధ్యక్షుడు బీజేపీ అధ్యక్షుడు అనంతరెడ్డి, యువ నాయకుడు డాక్టర్ మల్గారి వైభవ్‌రెడ్డి, నాయకులు మచ్చేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, జయసింహారెడ్డి, ఆశోక్, రాకేశ్‌రెడ్డి ఉన్నారు.



మందకృష్ణ మాదిగను సన్మానిస్తున్న నాయకులు

'పది'కి ప్రత్యేకం

(5వ పేజీ తరువాయి)

విద్యనభ్యసిస్తున్నారు. 2023-24 విద్యా సంవత్సరంలో జిల్లా 91.01 ఉత్తీర్ణత సాధించింది. ఈసారి వంద శాతం ఫలితాలు సాధించేలా జిల్లా విద్యాశాఖ 60 రోజుల ప్రణాళిక అమలు చేస్తోంది. ఉపాధ్యాయులు పాఠశాల పనిదినాల్లో రోజూ ఉదయం, సాయంత్రం విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. రోజువారీగా సబ్జెక్టుపై సన్నద్ధత తర్వాత పరీక్ష పెడుతున్నారు. వెనుకబడిన విద్యార్థులను దత్తత తీసుకొని ప్రత్యేకంగా బోధిస్తున్నారు. ఎలా చదవాలి. ఎక్కువ మార్కులు వచ్చేందుకు ఏయే విధానాలు అవలంభించాలనే విషయాలను వివరిస్తున్నారు.

రోజుకు 2 గంటలు..

జిల్లాలోని 319 ప్రభుత్వ పాఠశాలల్లో 16,908 మంది విద్యార్థులు చదువుతున్నారు. సిలబస్ పూర్తి కావడతో రోజూ మధ్యాహ్నం 3.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ప్రత్యేక తరగతులు చెబుతున్నారు. మొన్నటి వరకు ఒక గంట మాత్రమే ఉండగా ప్రస్తుతం రెండు గంటలకు సమయం పెంచారు. రోజువారీగా ఒక్కో సబ్జెక్టుకు సంబంధించిన ఉపాధ్యాయుడు తరగతులను పర్యవేక్షిస్తున్నారు.

పరీక్షల షెడ్యూల్..

పదో తరగతి వార్షిక పరీక్షలు 21 మార్చి 2025 నుంచి ప్రారంభం కానున్నాయి. ప్రధాన సబ్జెక్టుల పరీక్షలు ఏప్రిల్ 2వ తేదీతో ముగుస్తాయి. 3, 4 తేదీల్లో ఓరియంటల్ సబ్జెక్టుల పరీక్షలు జరుగుతాయి. ఒక్క సైన్స్ పరీక్షలు తప్ప మిగిలినవి ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు జరుగుతాయి. సైన్స్ సబ్జెక్టును భౌతిక, రసాయన శాస్త్రాలుగా మార్చి వాటిని వేర్వేరు రోజుల్లో నిర్వహించాలని నిర్ణయించడంతో.. ఆ రెండు పరీక్షలు ఉదయం 9.30 గంటల నుంచి 11 గంటల వరకు జరుగుతాయి. గతేడాది వరకు గ్రేడింగ్ విధానం ఉండేది. ఇటీవల దాన్ని తొలిగించి మార్కుల విధానం తీసుకొస్తామని ప్రభుత్వ జీవో జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ సంవత్సరానికి ఇంటర్నల్ మార్కులు (ఒక్కో సబ్జెక్టుకు 20 మార్కులు) యథాతథంగా ఉంటాయి. గ్రేడింగ్ లేకపోవడంతో ఈసారి మార్కుల పోటీ మరింత పెరుగుతుందని అంతా భావిస్తున్నారు.

సందేహాలను నివృత్తి చేసుకుంటున్నాను



పాఠశాలలో విద్యార్థుల బృంద చర్చల్లో పాల్గొంటున్నాను. సందేహాలను ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకుంటున్నాను. రోజువారీ పరీక్షలు రాస్తూ.. తప్పులు గుర్తించి మరోసారి జరగకుండా ప్రయత్నిస్తున్నాను. ప్రత్యేక తరగతులు నిర్వహించి పరీక్షలకు ఎలా సన్నద్ధం కావాలో ఉపాధ్యాయులు వివరిస్తున్నారు.

- అర్చన, జడ్పీహెచ్‌ఎస్, ఊరెళ్ల, చేవెళ్ల మండలం

ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం



చదువులో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నాం. పరీక్షలకు ఎలా సన్నద్ధం కావాలో చెబుతున్నాం. పరీక్ష పేపర్లు ఏవిధంగా వస్తాయో, ముఖ్యమైన ప్రశ్నలకు జవాబులు ఎలా రాయాలో వివరిస్తున్నాం. ఉత్తీర్ణత శాతాన్ని పెంచేందుకు కృషి చేస్తున్నాం. విద్యార్థులు సైతం అర్థం చేసుకొని బాగా చదవాలి.

- ఇలియాస్, ఉపాధ్యాయుడు, ఊరెళ్ల జెడ్పీహెచ్‌ఎస్, చేవెళ్ల

ప్రణాళికాబద్ధంగా చదవాలి



విద్యార్థులు శ్రద్ధగా చదువుకోవాలి. ప్రశ్నలకు సమాధానాలు రాస్తూ చదువుకోవాలి. విందులు, వినోదాలు, పెళ్లిళ్లకు దూరంగా ఉండాలి. పరీక్షా పత్రాలను అవగాహన చేసుకుని ప్రణాళికాబద్ధంగా చదవాలి. అన్ని అంశాలను రివిజన్ చేసుకోవాలి. ఎప్పటికప్పుడు సందేహాలను నివృత్తి చేసుకోవాలి. పాఠ్యాంశాలు ఎప్పటికప్పుడు చదివితే ఆందోళన ఉండదు.

- సుశీందర్‌రావు, జిల్లా విద్యాధికారి

ఫిబ్రవరి 3 నుంచి వాలీబాల్ పోటీలు

ఆమనగల్లు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని శెట్టిపల్లి గ్రామంలో ఫిబ్రవరి 3 నుంచి 5వ తేదీ వరకు రాష్ట్రస్థాయి ఓపెన్ టూ ఆల్ వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఎగిరిశెట్టి సత్యం తెలిపారు. ఈ పోటీలకు పెద్దఎత్తున ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. శెట్టిపల్లి శ్రీ అలివేలుమంగ సమేత వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో టోర్నమెంట్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గెలుపొందిన జట్లకు నగదు బహుమతులు ఉంటాయని, ఎంట్రీఫీజు రూ.300 చెల్లించి పేరు నమోదు చేసుకోవాలని సూచించారు.

గట్టిప్పలపల్లిని మండలం చేయాలి

తలకొండపల్లి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం ఏర్పాటుకు ఎంతటి పోరాటానికైన వెనుకాడబోమని జేఏసీ నాయకులు స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం క్యాబినెట్‌లో ఆమోదించిన 11 కొత్త మండలాల జాబితాలో గట్టిప్పలపల్లి పేరు లే కపోతే ఆమరణ నిరహార దీక్ష చేపడుతామని హెచ్చరించారు. జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరహార దీక్షలు సోమవారం 88వ రోజుకు చేరాయి. కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ అశోక్ గౌడ్, వైస్ చైర్మన్లు ఆంజనేయులు గౌడ్, శరత్‌చంద్ర, కార్యదర్శి అనిల్, జేఏసీ నాయకులు సాయిరామ్, కృష్ణాజీ, శేఖర్, రాములు, ముత్యాలు, శేషనాయక్, జంగయ్య, చెన్నయ్య, నర్సింహ్మ, రాములు, నాగయ్య, రత్నయ్య, తదితరులు ఉన్నారు.

శ్రద్ధగా చదువుకోవాలి

షాబాద్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు శ్రద్ధగా చదివి వృద్ధిలోకి రావాలని మాజీ ఎంపీటీసీ మద్దూరి పాండు ఆకాంక్షించారు. సోమవారం మండల పరిధిలోని వెంకమ్మగూడ గ్రామంలోని ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ స్కూల్‌లో చదువుతున్న విద్యార్థులకు మిద్దె అనసూజ జ్ఞాపకార్థం మిద్దె హరీష్ స్పోర్ట్స్ డ్రస్‌లను అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు సింహాద్రినాయుడు, ఉపాధ్యాయులు హేమసుందర్‌రావు, అంగన్‌వాడీ టీచర్ వినోద, సనిత పాల్గొన్నారు.

సామాజ సేవలో లయన్స్‌క్లబ్

కడ్తాల్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): సామాజిక సేవా కార్యక్రమాల్లో లయన్స్‌క్లబ్ అగ్రభాగాన నిలిచిందని లయన్స్‌క్లబ్ జిల్లా వైస్ గవర్నర్ మహేంద్ర కుమార్‌రెడ్డి అన్నారు. కడ్తాల మండల కేంద్రంలో సోమవారం లయన్స్‌క్లబ్ జిల్లా మాజీ గవర్నర్ చెన్నకిషన్ రెడ్డి మాతృమూర్తి గంగాపురం సుశీలమ్మ జ్ఞాపకార్థం అన్నదానం చేశారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ కార్యదర్శి దోనాదుల మహేశ్, కోశాధికారి గుజ్జరి నర్సింహ ఉన్నారు.

ప్రజల పర్యవేక్షణతోనే నాణ్యమైన పనులు

ఆమనగల్లు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ప్రజల పర్యవేక్షణతోనే పనులు నాణ్యతగా ఉంటాయని మాజీ ఎంపీపీ అనితావిజయ్ అన్నారు. మండలంలోని మేడిగడ్డ తండాలో ఎస్డీఎఫ్ నిధులు రూ.5 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను సోమవారం కాంగ్రెస్ నాయకుడు విజయ్‌రాథోడ్‌తో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీవో వినోద, పంచాయతీ కార్యదర్శి వెంకటయ్య, మాజీ ఉప సర్పంచ్ మల్లేశ్‌నాయక్, మాజీ ఎంపీటీసీ పరమేశ్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

కడ్తాల్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): కడ్తాల బీసీ కాలనీకి చెందిన వరికుప్పల బాలయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. సోమవారం బాధిత కుటుంబాన్ని డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి పరామర్శించారు. బాధిత కుటుంబానికి రూ.5 వేలు సమకూర్చగా స్థానిక యూత్ కాంగ్రెస్ నాయకులు అందజేశారు.

ప్రభుత్వంపై ఆరోపణలు తగవు



మాట్లాడుతున్న కాంగ్రెస్ మొయినాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి భీంభరత్

మొయినాబాద్ రూరల్, జనవరి27(ఆంధ్రజ్యోతి): పదేళ్లు అధికారంలో ఉండి ప్రజలకు ఇచ్చిన ఒక్క హామీని కూడా బీఆర్ఎస్ అమలు చేయాలేదని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి భీంభరత్, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి గౌరిసతీశ్ ఆరోపించారు. మండలంలోని అజీజ్‌నగర్‌లోని భీంభరత్ నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమంలో లేని పార్టీలు కాంగ్రెస్ కేంద్ర నాయకులపై ఆరోపణలు చేయడం సరికాదని.. వెంటనే కేంద్రమంత్రి బండి సంజయ్ గాంధీ కుటుంబానికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను చూసి ప్రతిపక్షాలు ఓర్వలేకపోతున్నారని మండిపడ్డారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. అనంతరం లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మాణయ్య, సీనియర్ నాయకులు కీసరి సంజీవరెడ్డి, బొలిగిద్ద సత్యనారాయణ, పురాణం వీరభద్రస్వామి ఉన్నారు.

హరీశ్ రావును కలిసిన గంప



హరీశ్‌రావును సన్మానిస్తున్న గంప వెంకటేశ్

కడ్తాల్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావును సోమవారం డీసీసీబీ డైరెక్టర్, ఆమనగల్లు పీఏసీఎస్ చైర్మన్ గంప వెంకటేశ్ మర్యాద పూర్వకంగా కలిశారు. కడ్తాల సమీపంలోని దాసర్లపల్లిలో యజ్ఞంలో పాల్గొనడానికి వచ్చిన హరీశ్‌రావును కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్‌యాదవ్, మాజీ జడ్పీటీసీ దశరథ్ నాయక్‌తో కలిసి సత్కరించి అభినందించారు. ప్రజా సమస్యలపై నిరంతరం ప్రజలపక్షాన పోరాడాలని హరీశ్‌రావు సూచించినట్లు పేర్కొన్నారు. రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, నాయకులు పత్యనాయక్, మహేశ్, రమేశ్ నాయక్, అంజి, నర్సింహ పాల్గొన్నారు.

క్రీడలతో మరింత ఉత్సాహం

కందుకూరు,జనవరి 27(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో టోర్నమెంట్‌లు క్రీడాకారుల్లో మరింత ఉత్సాహాన్ని నింపుతాయని బాజుపల్లి మాజీ ఎంపీటీసీ సురేష్, బీఆర్ఎస్ నాయకుడు ఎగిరిశెట్టి నరేష్ అన్నారు. వారం రోజులుగా మండంలోని బాచుపల్లిలో నిర్వహించిన బీపీఎల్ క్రికెట్ పోటీలు సోమవారం ముగిశాయి. ఈ సందర్భంగా విజేతలకు బహుమతిని అందజేశారు. ఈ పోటీల్లో ఆరు టీమ్‌లు పాల్గొనగా మొదటి బహుమతిని పరమేష్ టీమ్ గెలుపొందింది. వారికి రూ.12 వేల నగదుతోపాటు షీల్డు అందజేశారు. ద్వితీయ స్థానంలో షేర్‌బాబా టీమ్ నిలవగా రూ.8 వేల నగదుతోపాటు షీల్డును అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ యాలాల శ్రీనివాస్, గ్రామస్తులు పాల్గొన్నారు.

మహనీయుల ఆశయ సాధనకు కృషి చేయాలి

శంకర్‌పల్లి, జనవరి27(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేద్కర్, బాబూ జగ్జీవన్‌రావుల ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కాంగ్రెస్ చేవెళ్ల ఇన్‌చార్జి భీంభరత్ అన్నారు. మోకిల గ్రామంలో సోమవారం వారి విగ్రహాల ప్రతిష్ఠాపనకు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో మోకిల సొసైటీ చైర్మన్ గోపాల్, మాజీ సర్పంచ్‌లు నర్సింలు, ఆనంద్. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రాజు నాయక్. సీనియర్ నాయకులు మోహన్‌రెడ్డి, అడివయ్య. అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి



శంకర్‌పల్లి: తహసీల్దార్ సురేందర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

శంకర్‌పల్లి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం శంకర్‌పల్లి తహసీల్దార్ సురేందర్‌కు వినతిపత్రం ఇచ్చారు. పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు మాణిక్యం, ప్రధాన కార్యదర్శి బాల్‌రాజ్, ఉపాధ్యక్షుడు జయరాములు, నాయకులు రవికాంత్‌రెడ్డి, వీరేశం, సరిత, కవిత, సుగుణ, అనుపమ, రమ, వెంకట్‌రెడ్డి, ప్రభాకర్, శివాణి ఉన్నారు.

ఇబ్రహీంపట్నం: సీపీఎస్‌ను రద్దుచేసి ఓపీఎస్‌ను అమలు చేయాలని పీఆర్‌టీయూటీఎస్ ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం తహసీల్దార్ సునీతారెడ్డికి వినతిపత్రం అందజేశారు. 30 నుంచి 35 సంవత్సరాలు సర్వీస్ చేసిన ఉద్యోగ, ఉపాధ్యాయులు పాత పెన్షన్ పొందడమనేది వారి హక్కు అన్నారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ మేనిఫెస్టోలో పొందుపరిచిన విధంగా సీపీఎస్‌ను వెంటనే రద్దుచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూటీఎస్ మండల అధ్యక్ష కార్యదర్శులు పరమేశ్, చంద్రశేఖర్, రంగారెడ్డి, మల్లేశ్ పాల్గొన్నారు.

మత్తుకు దూరంగా ఉండాలి

చేవెళ్ల, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజేంద్రప్రసాద్ అన్నారు. సోమవారం పట్టణ కేంద్రంలో ఏబీవీపీ ఆధ్వర్యంలో యువతకు నిర్వహించిన క్రీడాపోటీలకు హాజరై మాట్లాడారు. చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు.

అపరిచితులతో తస్మాత్ జాగ్రత్త

ఇబ్రహీంపట్నం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): అపరిచితులతో ఛాటింగ్ చేయొద్దని ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు అన్నారు. సోమవారం ఇబ్రహీంపట్నం పరిధిలోని మంగల్‌పల్లి కళాశాలలో బాలికలకు నేరాలు, చట్టాలపై అవగాహన కల్పించారు. ఎలాంటి ఆపద వచ్చినా డయల్ 100కు సమాచారం ఇవ్వాలన్నారు. సైబర్ నేరగాళ్లతో అప్రమత్తంగా ఉండాలన్నారు.

క్రైం కార్నర్

లైంగికదాడి కేసులో నిందితుడికి ఐదేళ్ల జైలు

కొత్తూర్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సిద్దాపూర్ గ్రామానికి చెందిన ఏడేళ్ల బాలికపై లైంగికదాడికి పాల్పడిన అదే గ్రామానికి చెందిన గుండెమోని గోపాల్‌కు షాద్‌నగర్ కోర్టు ఐదేళ్ల కఠినకారాగార శిక్షతోపాటు రూ.8 వేలు జరిమానా విధించారని స్థానిక ఇన్‌స్పెక్టర్ నర్సింహారావు తెలిపారు. 2019లో బాలికను గోపాల్ కిడ్నాప్ చేసి అసభ్యకరంగా ప్రవర్తించాడు. బాలిక తల్లి నిర్మల ఫిర్యాదు మేరకు కొత్తూర్ పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ మేరకు కోర్టులో వాదోపవాదాలు విన్న అనంతరం నేరం రుజువు కావడంతో షాద్‌నగర్ ఎఫ్‌టీఎస్‌సీ పోక్సో కోర్టు జడ్జి అంజనేయులు నిందితుడికి శిక్షను ఖరారు చేశారు. కోర్టులో సీడీవో నిర్వహణ జరిపిన కోర్టు కానిస్టేబుల్ శివరంజన్‌ను ఇన్‌స్పెక్టర్ అభినందించారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

చౌదరిగూడ, జనవరి 27(ఆంధ్రజ్యోతి): జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రంలోని జాంగ్ర కాలనీలో ఇంట్లో దొంగతనం జరిగింది. ఎస్ఐ విజయ్ తెలిపిన వివరాల ప్రకారం.. చౌదరిగూడ గ్రామానికి చెందిన గూడ నారాయణ ఇంట్లో మూడు తులాల బంగారం, రూ.45 వేల నగదు, 25 తులాల వెండి ఆభరణాలు చోరీకి గురైనట్లు బాధితురాలు తెలిపింది. ఆదివారం నారాయణ తన కుటుంబ సభ్యులతో కలిసి బంధువుల ఇంట్లో జరిగిన శుభకార్యానికి వెళ్లారు. సోమవారం ఉదయం 7.30 గంటలకు ఇంటికి వచ్చి చూసే సరికి గేటుకు తాళం వేసి ఉంది. ఇంటి తాళం పగులకొట్టి బీరువాలో ఉన్న బంగారం, నగదు, వెండి, ఆభరణాలు ఎత్తుకెళ్లినట్లుగా గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. షాద్‌నగర్ రూరల్ ఇన్‌చార్జి సీఐ వెంకటేశ్వర్లు ఘటనాస్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. క్లూస్‌టీంతో ఫింగర్‌ప్రింట్స్ తీసుకున్నారు. బాధితురాలి కుమారుడు నందు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లాడ్జీల్లో తనిఖీలు.. కేసులు నమోదు

షాద్‌నగర్‌రూరల్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ పట్టణంతోపాటు పరిసర ప్రాంతాల్లో సోమవారం రాత్రి తనిఖీలు నిర్వహించినట్లు ఏసీపీ రంగస్వామి తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తనిఖీలు నిర్వహించి నిబంధనలకు విరుద్ధంగా ఉన్న నాలుగు లాడ్జీలపై కేసులు నమోదు చేసినట్లు వివరించారు.

షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

షాద్‌నగర్‌రూరల్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని విఠ్యాల గ్రామంలో మహమూద్ ఇంట్లో సోమవారం రాత్రి షార్ట్‌సర్క్యూట్ మంటలు చెలరేగాయి. దీంతో వస్తువులు పూర్తిగా కాలిపోయాయి. రిఫ్రిజిరేటర్ నుంచి పొగలు వస్తుండటం చూసిన వారు దానిని తెరిచి చూడగా ఒక్క సారిగా మంటలు వ్యాపించాయి. మంటల్లో కూలర్, బెడ్లు, బట్టలు కాలిపోయినట్లు బాధితుడు తెలిపారు. సుమారు రూ.లక్ష వరకు నష్టం జరిగిందని వాపోయాడు.

ఎన్నికల్లో డబ్బులు పంచితే జరిమానా

షాద్‌నగర్‌రూరల్, జనవరి27(ఆంధ్రజ్యోతి): ఫరూఖ్‌నగర్ మండలం ఉప్పరిగడ్డ గ్రామస్తులు మద్య నిషేధంపై తీర్మానం చేశారు. వచ్చే ఎన్నికల్లో పార్టీలు డబ్బులు పంచితే ఆ పార్టీకి రూ.4 లక్షలు జరిమానా విధించాలని నిర్ణయించారు. మందు అమ్మితే రూ.40 లక్షలు జరిమానా చెల్లించాలని ప్రకటించారు. మద్యం అమ్మిన వారి జాడ చెప్పితే రూ.10 వేలు ఇస్తామన్నారు. ఈ మేరకు తీర్మానం చేసి ప్రతులను ఇన్‌స్పెక్టర్ జయ్‌కుమార్, ఎక్సైజ్ అధికారులకు అందించారు.

చేవెళ్ల కమిషనర్‌గా కృష్ణమోహన్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న కృష్ణమోహన్‌రెడ్డి

చేవెళ్ల, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): చేవెళ్ల మున్సిపాల్ కమిషనర్‌గా కృష్ణమోహన్‌రెడ్డి సోమవారం కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. అనంతరం కార్యాలయం అధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. కొత్తగా ఏర్పాడిన చేవెళ్ల మున్సిపాల్ కార్యాలయంలో ఇన్‌చార్జి కమిషనర్‌గా బాధ్యతలు తీసుకున్నారు. ఇటీవల ఎనిమిది గ్రామ పంచాయతీలతో కూడిన చేవెళ్ల మున్సిపల్‌గా మార్చుతూ ఉత్వర్వులు జారీ చేసింది. పంచాయతీ కార్యాలయం పేరు తొలిగించి మున్సిపాల్ కార్యాలయం అని బోర్డు ఏర్పాటు చేయాలని కార్యాలయం అధికారులకు సూచించారు. నర్సింగ్ మున్సిపాల్ కమిషనర్‌గా కొనసాగుతున్న కృష్ణమోహన్‌రెడ్డికి చేవెళ్ల మున్సిపాల్ ఇన్‌చార్జి కమిషనర్‌గా కొనసాగనున్నారు. అలాగే మొయినాబాద్ మున్సిపల్ కమిషనర్‌గా శరత్‌చంద్ర బాధ్యతలు చేపట్టారు. కార్యక్రమంలో చేవెళ్ల గ్రామ కార్యదర్శి రాఘవేందర్, నరేందర్‌రెడ్డి, యాదయ్య, శ్రీకాంత్ ఉన్నారు.

మున్సిపల్ ప్రత్యేకాధికారిగా సాయినాథ్

శంకర్‌పల్లి, జనవరి27(ఆంధ్రజ్యోతి): శంకర్‌పల్లి మున్సిపల్ ప్రత్యేకాధికారిగా డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అధికారి సాయినాథ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. శంకర్‌పల్లి మున్సిపల్ కౌన్సిల్ పదవీకాలం ఆదివారం రోజుతో ముగియగా, రాష్ట్ర ప్రభుత్వం ఇన్‌చార్జిలుగా ప్రత్యేకాధికారులను నియమించిన విషయం తెలిసిందే. కాగా, డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అధికారి సాయినాథ్ ఈమేరకు బాధ్యతలు తీసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శంకర్‌పల్లి మున్సిపల్ అభివృద్ధికి తన వంతు తోడ్పాటును అందిస్తానని అన్నారు.

విద్యార్థులకు ఉపకార వేతనాల పంపిణీ

మొయినాబాద్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణ, పట్టుదలతో చదువుకోవాలని కేజీరెడ్డి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సాయి సత్యనారాయణరెడ్డి తెలిపారు. మొయినాబాద్ మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సోమవారం కేజీరెడ్డి కళాశాల యాజమన్యం పోలారిస్ ఉల్లాస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వార్షిక ఉపకార వేతన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉపకార వేతనాల చెక్కులను అందించారు.

'పదేళ్లలో బీఆర్ఎస్ చేసిందేమీ లేదు'

కందుకూరు, జనవరి 27(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పదేళ్ల కాలంలో చేసిందేమీ లేదని మాజీ జడ్పీటీసీ బొక్క జంగారెడ్డి ఆరోపించారు. సోమవారం విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో ఇప్పటికే రెండు అమలు చేసిందని, ప్రస్తుతం మరో నాలుగు గ్యారంటీలను అమలు చేస్తుందన్నారు. మాజీ ఎంపీపీ పల్లా మహేష్‌గౌడ్, నాయకులు రాణాప్రతాప్‌రెడ్డి, వెంకటేష్‌గౌడ్, అప్జల్ బేగ్, శ్రీధర్, విష్ణువర్ధన్‌రెడ్డి, అజీజ్, పాండుగౌడ్, ప్రశాంత్‌కుమార్, బాబు, వెంకటేష్, జగదీష్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐ యాదయ్యకు సన్మానం

ఆమనగల్లు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఏఎస్ఐ నుంచి ఎస్ఐగా పదోన్నతి పొందిన యాదయ్యను సోమవారం ఆమనగల్లు మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ గుర్రం కేశవులు, కాంగ్రెస్ జిల్లా నాయకుడు ఎగిరిశెట్టి సత్యం, చేనేత సంఘం అధ్యక్షుడు గాజుల శ్రీనివాస్ సన్మానించారు. అంకితభావంతో పనిచేసి ప్రజల అభిమానం చూరగొన్నారన్నారు.